క్లుప్తంగా

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 6 అర్జీలు



రేపల్లె రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 6 అర్జీలు అందాయని ఆర్డీవో నేలపు రామలక్ష్మి తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి అనంతరం మాట్లాడారు. భూమిని ఆన్‌లైన్ చేయాలని కోరుతూ 3, డ్రెయినేజ్ సమస్యపై 1, భూ సమస్యలపై 2 చొప్పున అర్జీలు అందాయన్నారు. సంబంధిత శాఖల అధికారులచే త్వరితగతిన సమస్యలను పరిష్కరించబడునని పేర్కొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



నిజాంపట్నం: మండల కేంద్రమైన నిజాంపట్నం పంచాయతీ కార్యాలయ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని ఈవోపీఆర్డీ రవిశంకర్ ప్రారంభించారు. పంచాయతీ కార్యాలయంతో పాటు పాదచారులు, వాహన చోదకులు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, ఎంపీటీసీ నాజర్‌ఖాన్, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కోపూరి రజనీకి అభినందన



పొన్నూరు: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి ఆర్థిక శాస్త్రంలో డాక్టరేట్ పొందిన కోపూరి రజనీని రచయిత, కవి కత్తి పద్మారావు సన్మానించారు. పట్టణంలోని లుంబినీ వనం అంబేడ్కర్ రీసెర్చ్ సెంటర్‌లో రజని సోమవారం కత్తి పద్మారావును కలిశారు. ఆర్థిక శాస్త్రవేత్త ప్రొఫెసర్ డాక్టర్ కె.మధుబాబు పర్యవేక్షణలో ఆమె గర్ల్ చైల్డ్ డొమెస్టిక్ వర్కర్స్– ఆర్థిక స్థితిగతులపై విశ్లేషణ అనే అంశంపై అనేక గ్రంథాలయాలకు వెళ్లి, ఎంతోమందిని విచారించి పరిశోధించారు. ఈ సందర్భంగా కత్తి పద్మారావు ఆమెను శాలువాతో సత్కరించి అభినందించారు. రజని పరిశోధన దేశానికెంతో ఉపయుక్తం అవుతుందని మాతా రమాబాయి అవార్డు గ్రహీత స్వర్ణకుమారి అన్నారు. కార్యక్రమంలో కత్తి నళిని, కత్తి చేతన్, తలకాయల అశోక్ పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల్లో మొక్కజొన్న కొనుగోలు చేయాలి

దుగ్గిరాల: చిన్న, సన్నకారు రైతులు పండిస్తున్న పెసలు, మొక్కజొన్న పంటలను రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి జెట్టి బాలరాజు కోరారు. తహసీల్దారు కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ ఐ.సునీతకు వినతి పత్రం అందజేశారు. అనంతరం బాలరాజు మాట్లాడుతూ రైతులకు గిట్టు బాటు ధర కల్పించాలన్నారు. పెసలు ధర క్వింటాకు రూ.8వేలు ఉండగా ప్రవేటు వ్యక్తులు దగ్గర వాటి ధర రూ.7వేలుగా కొనుగోలు చేయడంతో రైతులు వెయ్యి రూపాయలు నష్టం పోతున్నట్లు తెలిపారు. వ్యవసాయ శాఖ కొనుగోలు చేస్తామని పంట కొనుగోలు చేస్తామని ప్రకటన చేసినప్పటికీ ఎక్కడా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలేదన్నారు. వినతిపత్రం అందించిన వారిలో బి.అమ్మిరెడ్డి, స్టాలిన్ ఉన్నారు.

తాడేపల్లిలో వరుస చోరీలు



తాడేపల్లి రూరల్ : తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రతిరోజూ ఏదో ఒక ప్రాంతంలో చోరీలు జరుగుతుండడంతో చిరు వ్యాపారులు, ద్విచక్ర వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. సోమవారం తెల్లవారుజామున ప్రకాశం బ్యారేజ్ పాత జాతీయ రహదారి వెంబడి తాడేపల్లి సాయిబాబా గుడి వద్ద డేవిడ్ రాజు అనే చిరు వ్యాపారి దుకాణంలో చోరీకి పాల్పడ్డారు. దుకాణం పగలకొట్టి అందులో ఉన్న కూల్‌డ్రింక్ బాటిల్స్, సిగరెట్లు, రూ.6 వేల నగదు దొంగిలించారు. ఆ చిరు వ్యాపారి సుమారు రూ.18,500 నష్టం జరిగిందని, దుకాణం మరమ్మతులకు మరో రూ.5 వేలు ఖర్చు అవుతుందని ఆవేదన వ్యక్తం చేశాడు. తాడేపల్లి పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఇంటి ముందు పార్క్ చేసి ఉన్న మూడు ద్విచక్ర వాహనాల హ్యాండిల్ లాక్ తొలగించి చోరీ చేశారు. ఈ నెల 18న పాత పోస్టాఫీస్ వద్దపోయిన ద్విచక్ర వాహనాన్ని విజయవాడ మాచవరం వద్ద గుర్తు తెలియని వ్యక్తులు వదిలి వెళ్లిపోయారు.

గిట్టుబాటు ధర కోసం

రోడ్డెక్కిన రైతులు

- నల్లమడ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా
- పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన అన్నదాతలు
- కూటమి సర్కారు తీరుపై ఆగ్రహం

బాపట్లటౌన్: ఆరుగాలం కష్టించి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలంటూ అన్నదాతలు సోమవారం రోడ్డెక్కారు. నల్లమడ రైతు సంఘం ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల రైతులు సోమవారం బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించారు. తొలుత పట్టణంలోని చీలురోడ్డు సెంటర్ నుంచి రైతులు ర్యాలీగా కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. కలెక్టరేట్ ప్రధాన ద్వారం వద్ద పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఆగ్రహించిన అన్నదాతలు నేరుగా కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. గిట్టుబాటు ధర కోసం రైతులంతా ముక్తకంఠంతో నినదించారు. నినాదాలతో హోరెత్తించారు. నల్లమడ రైతు సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లా రాజమోహన్ మాట్లాడుతూ ప్రస్తుత కూటమి సర్కారు పాలనలో వ్యవసాయం చేస్తున్న రైతులు తీవ్ర మనస్తాపంతో ఉన్నారని అన్నారు. పండించిన ఏ పంటకు గిట్టుబాటు ధర లేదన్నారు. వ్యవసాయ రంగం పూర్తిగా సంక్షోభంలో కూరుకుపోయే పరిస్థితి దాపురించిందన్నారు. ప్రస్తుతం రైతుల పరిస్థితి ఎలా ఉందంటే మందుల కంపెనీలు, కార్పొరేట్ సంస్థలు, దళారులకు, ప్రభుత్వానికి జీఎస్టీ ద్వారా వచ్చే పన్నులు కట్టడానికే వ్యవసాయం చేస్తున్నట్లు ఉందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

కష్టానికి ఫలితం ఏదీ



నాది పర్చూరు మండలం అడుసుమల్లి గ్రామం. నేను మా గ్రామంలో 15 ఎకరాల్లో పొగాకు సాగుచేశా. గతంలో పొగాకు క్వింటా రూ.18 వేలకు కొనుగోలు చేశారు. ప్రస్తుతం రూ.10 వేలకు కూడా కొనే నాథుతడు లేడు. క్వింటాకు రూ.8 వేలు చొప్పున నష్టపోవాల్సి వస్తుంది.

– దొప్పలపూడి హరిబాబు, పొగాకు రైతు

రైతులను పట్టించుకోవడం లేదు



నా కున్న పొలంలో శనగ సాగు చేశాను. గతంలో తెల్ల శనగ క్వింటా రూ.11,500కు కొనుగోలు చేయగా ప్రస్తుతం రూ.6,500కు మాత్రమే అడుగుతున్నారు. ఎర్ర శనగ గతంలో రూ.8,000 ఉండగా ప్రస్తుతం రూ.5,500 మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదు.

– నాయుడు సుబ్బారావు, శెనగ రైతు, పర్చూరు

సాగు చేయాలంటే భయమేస్తుంది



నా పొలంలో మిర్చి సాగు చేశాను. గతానికి, ప్రస్తుతానికి క్వింటాకు రూ.9 వేలు పైగా ధర తగ్గించి అడుగుతున్నారు. లక్షల్లో పెట్టుబడులు పెట్టి సాగుచేసినా దళారులు అడుగుతున్న ధరలు చూసి గుండెజారిపోతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో వ్యవసాయం చేయాలంటేనే భయమేస్తుంది.

– కొల్లా సీతారామయ్య, నాగులపాడు గ్రామం, పెదనందిపాడు మండలం

రైతాంగ సమస్యలపై నిరంతరం పోరాడాలి

వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గణేష్



వైఎస్సార్‌సీపీ రేపల్లె సమన్వయకర్త డాక్టర్ గణేష్‌ను కలిసిన రైతు విభాగ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

చెరుకుపల్లి: రైతాంగ సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ అన్నారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం బాపట్ల జిల్లా అధ్యక్షుడిగా నియమితుడైన ఈడ శ్రీనివాస రెడ్డి సోమవారం గుళ్ళపల్లిలోని పార్టీ కార్యాలయంలో డాక్టర్ గణేష్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ పాలనలో రైతులు సుభిక్షంగా ఉంటే ప్రస్తుతం కూటమి పాలనలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గతంలో చేసిన మేలును ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చేసిన మోసాలను రైతులు, ప్రజలకు వివరించి చైతన్య పరచాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

రంజాన్‌ను కలిసికట్టుగా చేసుకుందాం

వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కాగిత సుధీర్‌బాబు



పండ్లు పంపిణీ చేస్తున్న కాగిత సుధీర్‌బాబు

బాపట్ల: పవిత్ర రంజాన్‌ను అందరం కలిసికట్టుగా చేసుకుందామని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కాగిత సుధీర్‌బాబు పేర్కొన్నారు. రంజాన్ మాసం సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కోన రఘుపతి ప్రతి మసీదుకు పండ్లు, డ్రై ఫ్రూట్స్‌ను సోమవారం అందించారు. ఈ సందర్భంగా వాటిని మసీదులకు పట్టణ అధ్యక్షుడు కాగిత సుధీర్‌బాబు పంపిణీ చేసి మాట్లాడారు. ప్రతి ఏడాది కోన రఘుపతి ఆధ్వర్యంలో ముస్లింలకు ఫలహారాలు, పండ్లు అందించటం జరుగుతుందన్నారు. అందరం కలిసి పండుగ చేసుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు షేక్ సయ్యద్ పీర్, జోగి రాజాబాబు, సుభాని, మణికంఠరెడ్డి, అంకమ్మచౌదరి, అఫ్జల్, సయ్యద్ అక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూ లైబ్రేరియన్ విజయకుమార్ మృతి



విజయకుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వీసీ గంగాధరరావు, రత్నషీలామణి

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ లైబ్రేరియన్ డీబీ విజయకుమార్ మృతి తీరనిలోటు అని పలువురు పేర్కొన్నారు. వర్సిటీలో సోమవారం సంతాప సభ నిర్వహించారు. ఆదివారం అర్ధరాత్రి గుండెపోటుతో ఆయన మృతి చెందారు. యూనివర్సిటీలో పలు హోదాల్లో విధులు నిర్వహించిన విజయకుమార్ ప్రస్తుతం యూనివర్సిటీ ప్రధాన గ్రంథాలయం లైబ్రేరియన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. సంతాప సభలో వీసీ కె.గంగాధరరావు, రెక్టార్ కె.రత్నషీలామణి, వికాస అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, జె.శ్రీనివాసరావు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కె.వీరయ్య, బాబూ జగ్జీవన్‌రామ్, పూలే అధ్యయన కేంద్రాల డైరెక్టర్లు పీజే రత్నాకర్, ఎం.త్రిమూర్తిరావు, ఉద్యోగ సంఘ నాయకులు ఎస్.వెంకటేశ్వర్లు, వై.రాధాకృష్ణ పాల్గొని విజయకుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం యూనివర్సిటీ అధికారులు, ఉద్యోగులు గుంటూరులోని విజయకుమార్ స్వగృహానికి వెళ్లి ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించారు.

వేసవి దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం దోహదం



చలివేంద్రం ప్రారంభోత్సవంలో డబల్ హార్స్ మేనేజర్ రవికుమార్

తెనాలిటౌన్: ప్రజల వేసవి దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం సేవలు దోహదపడతాయని డబల్ హార్స్ మినపగుళ్ల మేనేజర్ రవికుమార్ పేర్కొన్నారు. రూరల్ మండలం నందివెలుగు నాలుగు లైన్ల ప్రధాన రహదారిపై సోమవారం మేము సైతం యువజన సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా డబల్ హార్స్ మినపగుళ్ల మేనేజర్ రవికుమార్, ఎంపీటీసీ–1 తిన్నలూరు విజయలక్ష్మి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ప్రతి ఏటా మేము సైతం యువజన సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేసి బాటసారుల దాహార్తిని తీర్చడం అభినందనీయమని సభ్యుల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ధూళిపాళ్ళ పానకలరావు, సంఘ ప్రధాన కార్యదర్శి షేక్ షుకూర్ బాషా, గౌరవాధ్యక్షుడు ధూళిపాళ్ళ సుధాకర్, అధ్యక్షుడు కళ్యాణం సాంబశివరావు, ఉపాధ్యక్షుడు యర్రమోతు జగన్‌మోహన్‌రావు, సభ్యులు కళ్యాణం కళ్యాణ్‌కుమార్, కళ్యాణం నరసింహారావు, కళ్యాణం కృష్ణసాగర్, ఎస్.వెంకటనరసయ్య, విష్ణుమొలకల నాగేశ్వరరావు, యర్రమోతు సత్యనారాయణ, మాదిరాజు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రుచిగా, శుచిగా ఆహారం అందించాలి



విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న ఎంఈఓ

చినలింగాయపాలెం(కాకుమాను): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యశించే ప్రతి విద్యార్థికీ రుచిగా, శుచిగా సరిపడా మధ్యాహ్న భోజనాన్ని అందించాలని ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ సూచించారు. మండలంలోని చినలింగాయపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మంచి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని నిర్వాహకులకు ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం రుచి చూశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగమణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాడేపల్లి వ్యక్తికి ఉత్తమ కార్టూనిస్ట్ అవార్డు

తాడేపల్లి రూరల్ : తాడేపల్లికి చెందిన ఐ. నాగేశ్వరరావుకు ఉత్తమ కార్టూనిస్ట్ అవార్డు అందుకున్నారు. విశాఖపట్నంకు చెందిన ఉత్తరాంధ్ర కోస్తా కార్టూనిస్టుల ఫోరం, హాస్యానందం సౌజన్యంతో శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది (2025) సంవత్సరానికి గాను ఐ.నాగేశ్వరరావు వేసిన కార్టూన్‌ను ఎంపిక చేశారు. ఆ అవార్డును నాగేశ్వరరావు విజయవాడ కేబీఎన్ కళాశాలలో విశాఖపట్నంకు చెందిన నార్త్ కోస్టర్ ఫోరం, హాస్యానందం సంపాదకులు రాము, రామశర్మ, టి.ఆర్.బాబు, ఎస్.లక్ష్మణరావుల సమక్షంలో అందుకున్నారు. ఐ.నాగేశ్వరరావుకు ఉత్తమ కార్టూన్ అవార్డు రావడంతో తాడేపల్లి వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

రేపల్లె రూరల్: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో ఈ నెల 25వ తేదీ మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఇసుకపల్లి నుంచి ఉప్పూడి రోడ్డు వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయబడునని ఆ శాఖ పట్టణ ఏఈ శివనాగిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రక్తదాతకు అభినందన

తెనాలిటౌన్: ప్రాణాపాయ స్థితిలో ఉన్న మహిళకు రక్తదానం చేసిన ఏసీ మెకానిక్, పెదరావూరు గ్రామ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు అద్దంకి కోటేశ్వరరావు సేవలు అభినందనీయమని ఆర్టీసీ ఉద్యోగి ఈపూరి ప్రేమ్‌కుమార్ కొనియాడారు. పెదపూడి గ్రామానికి చెందిన కుక్కమళ్ళ యేసుమణి అనే మహిళ భర్తను కోల్పోయి కూలీ పనులు చేసుకుంటూ ఇద్దరు పిల్లలతో జీవిస్తుంది. ఆమెకు ఇటీవల జబ్బు చేయడంతో స్థానిక గంగానమ్మ పేటలోని దివిస్ హాస్పిటల్‌లో ఆపరేషన్ చేస్తుండగా సర్జరీ నిమిత్తం రక్తం అవసరమవడంతో బీజేఆర్ కమిటీ సభ్యుల సహకారంతో అద్దంకి కోటేశ్వరరావు వెంటనే ఆమెకు రక్తదానం చేయడంతో కోటేశ్వరరావును పెదరావూరు బాప్టిస్ట్ చర్చి కమిటీ పెద్దలు అభినందించారు.

దావులూరులో సీపీఎం ప్రజా చైతన్య యాత్ర



దావులూరు (కొల్లిపర): ప్రజా చైతన్య యాత్ర కార్యక్రమంలో భాగంగా సీపీఎం బృందం ములకా శివసాంబిరెడ్డి, కోట చంద్రశేఖరరావు, జిలుగు ముక్కంటి తదితరులు సోమవారం మండలంలోని దావులూరు గ్రామంలో ప్రజా సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో సీపీఎం బృందం ఎదుట ప్రజలు వారి సమస్యలను విన్నవించుకుని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం సీనియర్ నాయకులు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ గుండేరు డ్రైన్ కింద సాగు చేస్తున్న పేద ఎస్సీ రైతులకు ఉచితంగా ప్రభుత్వం బోర్లు వేయించాలని విజ్ఞప్తి చేశారు. కౌలు కార్డులు పొందిన వారికి రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని, చదువుకున్న యువకులకు ప్రభుత్వమే ఉచిత కోచింగ్ సెంటర్ ద్వారా అవకాశాలు కల్పించాలని అన్నారు. గ్రామంలో బేతాళ బజారు, మసీదు బజారు, లైబ్రరీ సెంటర్ ప్రాంతాలలో సైడ్ కాలువలు లేక మురుగు నీరు నిల్వ ఉండి వాసన, దోమలతో అవస్థలు పడుతున్నారని, దళిత వాడలో ఉన్న కొద్దిపాటి శ్మశాన స్థలం నిండి పోయిందని కావున శ్మశాన స్థలం మంజూరు చేయాలని ప్రజల తరపున ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో గ్రామంలోని ప్రజలు, మహిళలు, రైతులు పాల్గొన్నారు.

ఆలయంలో మద్యం మత్తులో వ్యక్తి వీరంగం

పెదకాకాని: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పెదకాకాని శ్రీభ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఓ వ్యక్తి మద్యం మత్తులో వీరంగం చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. భోజనశాల వద్దకు ఆదివారం పెదకాకాని చెందిన వ్యక్తి వచ్చి భోజనం పెట్టాలని సిబ్బందితో వాదనకు దిగాడు. మద్యం తాగి ఆలయంలోకి రాకూడదని సిబ్బంది చెప్పినా ఫోన్‌లో ఫోటోలు తీస్తూ, బెదిరిస్తూ విన్యాసాలు చేశాడు. తర్వాత సిబ్బంది వీడియో తీయడంతో అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

పీ–4 సర్వేపై అవగాహన కలిగి ఉండాలి

మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్



తెనాలిఅర్బన్: పీ–4 సర్వేపై అందరూ అవగాహన కలిగి ఉండాలని మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, అసిస్టెంట్ కమిషనర్ బీఎం లక్ష్మీపతిరావులు పేర్కొన్నారు. 7వ వార్డులోని సచివాలయంలో సోమవారం వార్డు సభను నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలోని 40 వార్డులలో వార్డు సభలు జరుగుతున్నాయని చెప్పారు. పీ–4 సర్వే 90 శాతంపైగా పూర్తయినట్లు చెప్పారు. మిగిలిన వారు కూడా సర్వే చేయించుకోవాలన్నారు. దీని వలన రానున్న రోజుల్లో ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు లభిస్తాయని చెప్పారు. సమావేశంలో పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమాలు తప్పవు

సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్



మున్సిపల్ కమిషనర్ సాంబశివరావుకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు, ప్రజలు

రేపల్లె రూరల్: పట్టణంలో నెలకొన్న సమస్యలను పాలకులు, అధికారులు సత్వరమే పరిష్కరించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్ డిమాండ్ చేశారు. పట్టణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ సాంబశివరావుకు, తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావుకు వినతిపత్రాలు అందజేసి అనంతరం మాట్లాడారు. టిడ్కో గృహ లబ్ధిదారులకు గృహాలను నిర్మించి త్వరితగతిన అందజేయాలన్నారు. సొంత ఇంటి కోసం వేల రూపాయలు అప్పులు చేసి లబ్ధిదారులు వేచిచూస్తున్నారన్నారు. పట్టణంలో తాగునీటి సమస్య ప్రధానంగా ఉందని, డ్రెయిన్‌లు, రోడ్లు సమస్యలను పరిష్కరించాలన్నారు. జగనన్న కాలనీలో కనీస వసతులు కరువై ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కాలనీలో రహదారి సౌకర్యం, డ్రెయిన్‌లు లేకపోవటంతో మురుగు ఎక్కడిక్కడే నిలిచిపోయి అంటువ్యాధులు వ్యాపించే ప్రమాదముందన్నారు. సమస్యలను సత్వరమే పరిష్కరించకుంటే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. గతంలో డ్వాక్రా మహిళలకు తెలియకుండా వారి పేరుపై రుణాలు పొందిన యానిమేటర్, అవినీతికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవటంతో పాటు గ్రూపులోని సభ్యులకు బ్యాంకుల నుంచి వేధింపులు లేకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కేవీ లక్ష్మణరావు, కె.ఆశీర్వాదం, డి.అగస్టీన్, కె.రమేష్, వై.నవీన్, జె.ధర్మరాజు, కె.నాంచారమ్మ, పలు వార్డుల ప్రజలు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రెండు పూరిళ్లు దగ్ధం



రేపల్లె రూరల్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రెండు పూరిళ్లు దగ్ధమైన ఘటన మండలంలోని చోడాయపాలెంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు కనపర్తి సువార్తమ్మకు చెందిన పూరింట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ చోటు చేసుకుని మంటలు ఎగసిపడ్డాయి. మంటలు పక్కనే ఉన్న కనపర్తి సుందరరావు ఇంటికి వ్యాపించాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపక శాఖ కార్యాలయంకు సమాచారం అందించగా, అగ్నిమాపక శాఖ సిబ్బంది హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఘటనలో సువార్తమ్మకు చెందిన పూరిల్లు, సామగ్రి దగ్ధమవ్వగా రూ.1 లక్ష ఆస్తి నష్టం వాటిల్లిందని, సుందరరావుకు చెందిన రాతి గోడల పూరిల్లు, సామగ్రి దగ్ధమవ్వగా రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధితులు తెలుపుతున్నారు.

సబ్సిడీ రుణాలు అందజేత



లబ్ధిదారులకు బ్యాంకు బుక్ అందజేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

కర్లపాలెం: మహిళల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీ రుణాలు అందజేస్తున్నాయని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ చెప్పారు. కర్లపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం ప్రధానమంత్రి అనుచిత జాతీయ అభ్యుదయ యోజన (పీఎం అజయ్) పథకంలో ఐదుగురు మహిళలకు సబ్సిడీ రుణాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్రవర్మ మాట్లాడుతూ మహిళలు సబ్సిడీ రుణాలను వినియోగించుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని చెప్పారు. ఏపీఎం శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ మహిళలను లక్షాధికారులను చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీ రుణాలు అందజేస్తున్నాయని తెలిపారు. ప్రధానమంత్రి అనుచిత జాతీయ అభ్యుదయ యోజనలో 50 శాతం సబ్సిడీతో బడ్డీ కొట్టు నిర్వహణకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఒక్కొక్కరికీ లక్ష రూపాయలను రుణంగా అందజేసినట్లు తెలిపారు. ఈ రుణాలలో లబ్ధిదారులు మార్జిన్ మనీగా రూ.10 వేలు, బ్యాంకులు రూ.40 వేలు, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రూ.50 వేలు మొత్తం రూ.లక్ష రుణంగా ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నక్కా లలితకుమారి, జెడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, ఎంపిడిఓ ఎ.శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ అహ్మద్ బాషా, టీడీపీ మండల అధ్యక్షుడు ఏపూరి భూపతిరావు, వెంకటస్వామి తదితరులు ఉన్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

ఆందోళనకు దిగిన ఆరోగ్యమిత్రలు



కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన వ్యక్తం చేస్తున్న ఆరోగ్యమిత్రలు

బాపట్లటౌన్: ఏళ్ల తరబడి డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో పని చేస్తున్నా... మా సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోగ్యమిత్ర కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బడుగురాజు తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన వ్యక్తం చేశారు. బడుగురాజు మాట్లాడుతూ ఏళ్ల తరబడి పని చేస్తున్నా మాకు ఉద్యోగ భద్రత లేకుండా పోతుందన్నారు. అనేక పర్యాయాలు దరఖాస్తు చేసినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో ఈ నెల 17 నుంచి 24 వరకు విధులు బహిష్కరించి శాంతియుత నిరసన తెలియజేశామన్నారు. ఈ నెల 27న ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు వద్ద శాంతియుత నిరసన తెలియజేస్తామన్నారు. వైద్య సేవ పథకంలో పని చేసే ప్రతి ఒక్కరిని ప్రభుత్వ కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించాలి, కనీస వేతనం అమలు చేయాలి, వైద్య సేవ ఉద్యోగి మరణిస్తే వారి కుటుంబ సభ్యులకు రూ.15 లక్షల ఎక్స్‌గ్రేషియో, రిటైర్‌మెంట్ బెనిఫిట్ రూ.10 లక్షలు అందించాలి. అర్హత ప్రకారం ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

క్షయను ముందుగా గుర్తిస్తే నివారణ



పీహెచ్‌సీలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యాధికారి, సిబ్బంది

చేబ్రోలు: క్షయ వ్యాధిని ముందస్తుగా గుర్తిస్తే నివారణ సాధ్యమవుతుందని చేబ్రోలు పీహెచ్‌సీ వైద్యాధికారి జి. అబ్రహం లింకన్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ ఏడాది క్షయ వ్యాధిని అంతమొందించడమే లక్ష్యంగా, ప్రతి ఒక్కరినీ చైతన్యవంతులు చేసే విధంగా సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు అబ్రహం లింకన్, సీహెచ్. శైలజ మాట్లాడుతూ క్షయ వ్యాధి నివారణకు మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. టీబీ ఉందని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. ఉచిత మందులు, పౌష్టికాహారం నిమిత్తం ఆర్థిక సహాయం ద్వారా సురక్షితంగా జీవించవచ్చని పేర్కొన్నారు. క్షయ వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలను తెలియజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

27న బహిరంగ వేలం

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ మార్కెట్లు, సైకిల్ స్టాండ్లు, టాయిలెట్స్‌ల టెండర్, బహిరంగ వేలం ఈ నెల 27న నగరపాలక సంస్థ ట్రావెలర్స్ బంగ్లాలో నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వేలంలో ఇప్పటికే ఉన్న లీజుదారులు కూడా బకాయిలు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు. ఆసక్తి కలిగిన వారు రూ.100 చలానా చెల్లించి, నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని రెవెన్యూ విభాగంలో ఏ–2 గుమస్తా వద్ద నుంచి టెండర్ షెడ్యూల్ పొందవచ్చని తెలిపారు. వివరాలకు డెప్యూటీ కమిషనర్ (9849908364)ని సంప్రదించాలని ఆయన సూచించారు.